సాక్షి
చిత్తూరు
గురువారం । 11 ఏప్రిల్ । 2024



టెర్రరిస్టులతో పోల్చడం తగదు

నిస్వార్థంగా సేవలందిస్తున్న తమను టీడీపీ నేతలు టెర్రరిస్టులతో పోల్చడం తగదని వలంటీర్లు తెలిపారు. - IIలో

నేనుసైతం..



నగరి జీరకుప్పానికి చెందిన దివ్యాంగుడు ఏలుమలై రెడ్డి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ప్రభుత్వం, మంత్రి రోజా చేసిన అభివృద్ధి పనులను వివరించారు. - IIలో



వైఎస్సార్ సీపీలోకి భారీ చేరికలు

టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. - IIలో

న్యూస్‌రీల్

ఎన్నికల సామగ్రి తరలింపు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు జిల్లాలోని నియోజకవర్గాలకు ఎన్నికల సామగ్రిని అధికారులు బుధవారం తరలించారు. డీఆర్‌ఓ పుల్లయ్య సమక్షంలో ప్రత్యేక వాహనాల్లో పంపించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల ఎన్నికల్లో ఉపయోగించడానికి అవసరమైన సామగ్రిని జిల్లాకు పంపింది. వాటిని ఎన్నికల గోడౌన్‌లో భద్రపరిచారు. ఈ క్రమంలో వాటిని ఆయా నియోజకవర్గాలకు పంపే ప్రక్రియను కలెక్టరేట్ అధికారులు పకడ్బందీగా చేపట్టారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేశ్వరన్, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు తెలపండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో 2018 డీఎస్సీలో క్రీడా కోటాలో దరఖాస్తు చేసుకుని వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థులు అభ్యంతరాలుంటే ఈ నెల 19వ తేదీలోపు తెలియజేయాలని డీఈఓ దేవరాజు తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ 2018లో నిర్వహించిన డీఎస్సీ పరీక్షలో క్రీడాకోటాలో దరఖాస్తు చేసుకుని, వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న అభ్యర్థుల వివరాలు డీఈఓ కార్యాలయం నోటీస్ బోర్డులో ఏర్పాటుచేశామన్నారు. సంబంధిత అభ్యర్థులు పేర్లను పరిశీలించుకుని అభ్యంతరాలుంటే ఈ నెల 19వ తేదీలోపు లిఖిత పూర్వకంగా అందజేయాలన్నారు. గడువు తరువాత వచ్చే అభ్యంతరాలను స్వీకరించబోమని వెల్లడించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



డీఈఓ కార్యాలయం వద్దనున్న స్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌ఓ

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్ కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు ఉండాలని చిత్తూరు ఆర్‌ఓ, జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. ఆయన బుధవారం నగరంలోని పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఫర్నీచర్, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, వీల్ చైర్స్, ర్యాంప్‌లు, ఇంటర్‌నెట్, తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. ఓటు వేసే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదన్నారు. నగర పాలక కమిషనర్ అరుణ, చిత్తూరు అర్బన్ తహసీల్దార్ శ్రీనివాసులురెడ్డి, పాల్గొన్నారు.

12 నుంచి ఈవీఎంల ర్యాండమైజేషన్



ఈవీఎంల గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్, ఎస్పీ మణికంఠ

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల నిబంధనల ప్రకారం ఈ నెల 12 నుంచి ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఆయన బుధవారం ఎస్పీ మణికంఠ, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టరేట్‌లోని ఎన్నికల గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈవీఎం గోడౌన్ వద్ద పకడ్బందీ భద్రత ఏర్పాటు చేశామన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు విడివిడిగా ర్యాండమైజేషన్ నిర్వహిస్తామన్నారు. డీఆర్‌ఓ పుల్లయ్య, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉదయ్, అట్లూరి శ్రీనివాసులు, పరదేశి, గంగరాజు పాల్గొన్నారు.

వారికి మినహాయింపు ఇవ్వండి



డీఆర్‌ఓతో చర్చిస్తున్న ఆపస్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : అనారోగ్య సమస్యలున్న టీచర్లకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ కోరారు. ఆయన బుధవారం ఆ సంఘం నాయకులతో కలిసి డీఆర్‌ఓ పుల్లయ్యకు వినతి పత్రం అందజేశారు. దీర్ఘకాలికంగా అనారోగ్యంతో బాధపడుతున్న, ప్రమాదాల బారిన పడి చికిత్స పొందుతున్న, 6 నెలల్లోపు ఉద్యోగ విరమణ చేయనున్న, 80 శాతం అంగవైకల్యం ఉన్న టీచర్లకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. ఈ విషయాలను జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని డీఆర్‌ఓ హామీ ఇచ్చారు. సాంబిరెడ్డి, మంజునాథ, దేవరాజులు, దాము తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఒడి.. చదువుల బడి



ప్రతి ఏటా జూన్‌లో పాఠశాలలు ప్రారంభమయ్యాయంటే తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరిగెట్టేవి. ఫీజులు, పుస్తకాలు, యూనిఫామ్ కొనేందుకు ఏమి చేయాలో తెలియక తలలు పట్టుకునే పరిస్థితి. ఈ ఆర్థిక భారాన్ని మోయలేక పేద తల్లిదండ్రులు తమ పిల్లలను మధ్యలోనే చదువు మాన్పించి పనులకు పంపించే దుస్థితి. ఇది ఐదేళ్ల క్రితం నాటి మాట. వైఎస్.జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆ పరిస్థితి మారింది. ''పిల్లల చదువుకు పేదరికం అడ్డు కాకూడదు. పిల్లలకు మనం ఇచ్చే తరగని ఆస్తి విద్య మాత్రమే. మీరు పిల్లలను బడికి పంపించండి, మేనమామగా వారి చదువు బాధ్యతను నేను తీసుకుంటాను'' అని చెప్పారు. అన్నట్టుగానే అమ్మ ఒడి పథకం అమలుచేసి ప్రతి ఏటా పిల్లల తల్లి ఖాతాలో రూ.15 వేలు జమ చేశారు. తద్వారా పిల్లల చదువుల భారం తనపై వేసుకున్నారు. నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారు. విద్యా కానుక కింద సంవత్సరానికి సరిపడా పాఠ్య, నోట్ పుస్తకాలు, డిక్షనరీ, బూట్లు, సాక్సులు, బ్యాగు, మూడు జతల యూనిఫామ్ అందజేశారు. జగనన్న గోరుముద్ద కింద పౌష్టికాహారం పెట్టేలా చర్యలు తీసుకున్నారు. ట్యాబ్‌లు ఇస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపుతున్నారు. – పలమనేరు

- అమ్మ ఒడితో పిల్లల చదువుకు తొలగిన కష్టాలు
- విద్యాకానుక, ట్యాబ్‌ల పంపిణీ
- మేనమామగా బాధ్యత తీసుకున్న సీఎం జగన్
- ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు	469
అమ్మ ఒడితో లబ్ధిపొందిన పిల్లలు	40,100 మంది
ఇందుకోసం వెచ్చించిన నగదు	రూ.165.19 కోట్లు
మొదటి విడత నాడు-నేడులో బాగు చేసిన స్కూళ్లు	123
ప్రభుత్వం పెట్టిన ఖర్చు	రూ.32.87 కోట్లు
రెండో విడతలో ఎంపికైన పాఠశాలలు	230
ఖర్చుచేయనున్న మొత్తం	రూ.62 కోట్లు
పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య	51 వేలు
నియోజకవర్గంలో పంపిణీ చేసిన జేవీకే కిట్లు	51 వేలు

నా బిడ్డ చదువు నేనే చూసుకుంటా



నా కుమారుడు తరుణ్ ఐదో తరగతి చదువుతున్నాడు. నాలుగేళ్లుగా నాకు అమ్మ ఒడి అందుతోంది. ఇంతకుముందు బడి తెరుస్తున్నారంటే డబ్బులకు ఏం చేసేదిస్వామి అనే బెంగ ఉండేది. ఇప్పుడలా కాదు పిల్లలకు ప్రభుత్వమే అన్నీ ఇస్తోంది. మంచి భోజనం పెడుతున్నారు. వారికి చదువు పరంగా ఏ ఇబ్బంది వచ్చినా అమ్మ ఒడి నగదును వాడుకుంటున్నాం.

– రోజా, విద్యార్థి తల్లి, వెంగంవారిపల్లి, బైరెడ్డిపల్లి మండలం

అమ్మ ఒడితోనే నా బిడ్డకు చదువు



బైరెడ్డిపల్లి మండలం శెట్టిపల్లికి చెందిన మొగిశమ్మ భర్త నారాయణాచారి ఐదేళ్ల క్రితం మృతి చెందాడు. కుటుంబం గడవడమే కష్టంగా మారింది. తల్లి కూలికెళితే బిడ్డ హరిత ఇంట్లో ఉండేది. అమ్మ ఒడి మంజూరు కావడంతో ఆ తల్లి తన బిడ్డను బాగా చదివించాలని బడికి పంపింది. ప్రస్తుతం హరిత లక్కనపల్లి హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతోంది. అమ్మ ఒడి డబ్బును జాగ్రత్తగా దాచుకుని బిడ్డకు చదువుకోసం వెచ్చిస్తోంది మొగిశమ్మ.

ఇద్దరు బిడ్డలను చదివిస్తున్నా



గంగవరం మండలం కొత్తపల్లి దళితవాడకు చెందిన రుక్మిణి, బాలాజీ దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు. కూలి పనులే జీవనాధారం. ఇద్దరు పిల్లల చదువులు భారంగా మారాయి. ఒకరి చదివించి మరొకరిని ఆపేద్దామనుకున్నారు. అమ్మ ఒడి రావడంతో ఇద్దరి చదువులు బాగా సాగుతున్నాయి. పెద్దమ్మాయి అఖిల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం, రెండో కుమార్తె భాను కొత్తపల్లి హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్నారు.

బడికి నిలిపేద్దామనుకున్నారు



బైరెడ్డిపల్లి మండలం కానాలిండ్లుకు చెందిన చిన్నసామి, లక్ష్మి భార్యాభర్తలు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమార్తె హేమలత చదువు వీరికి భారంగా మారింది. ఏడో తరగతిలోనే చదువు నిలిపేయాలనుకున్నారు. ఇంతలో వీరికి అమ్మ ఒడి మంజూరైంది. ఏటా రూ.15 వేలు లక్ష్మి ఖాతాలో జమయ్యాయి. ఈ డబ్బును వృథా చేయకుండా బిడ్డను బాగా చదివిస్తున్నారు. ప్రస్తుతం బాలిక పొన్నమాకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఉన్నత చదువులు సైతం చదివిస్తామని తల్లిదండ్రులు ధైర్యంగా చెబుతున్నారు.



పలమనేరు మండలం కొలమాసనపల్లిలో మారిన సర్కారు బడి

ఏటా కొంత డిపాజిట్ చేస్తున్నా



పెద్దపంజాణి మండలం బందార్లపల్లికి చెందిన సుమకు అమ్మ ఒడి వరంలా మారింది. కొడుకు బన్నీని గ్రామంలోని ప్రభుత్వ బడిలో చేర్పించింది. స్కూల్ తెరిచినప్పుడల్లా యూనిఫామ్, బ్యాగు, షూలు తదితరాలకు అప్పు చేయాల్సి వచ్చేది. అమ్మ ఒడి వచ్చాక ఇబ్బందులు లేకుండా బిడ్డను చదివిస్తోంది. ప్రస్తుతం బన్ని నాలుగో తరగతి చదువుతున్నాడు. తనఖాతాలో జమయ్యే నగదులో కొంత బ్యాంకులో డిపాజిట్ చేస్తున్నానని, పిల్లాడి ఉన్నత విద్యకు ఉపయోగపడుతుందని సుమ పేర్కొంది.

బిడ్డల చదువే ఆస్తిగా భావిస్తున్నాం



వీకోటలోని భారత్ నగర్‌కు చెందిన కస్తూరి కూలి పనులు చేసుకుంటోంది. ఆమె భర్త ఆటో డ్రైవర్. వీరికి ముగ్గురు పిల్లలు. పిల్లలను బాగా చదివించాలన్నదే వీరి ఆశయం. వీరికి అమ్మ ఒడి అండగా నిలిచింది. పెద్ద కుమార్తె సుప్రియ ఐదు, రెండో అబ్బాయి ఉమేష్ నాలుగు, మూడో అబ్బాయి మహేష్ మొదటి తరగతి చదువుతున్నారు. అమ్మ ఒడి రాకుంటే ముగ్గురు పిల్లల చదువుకు కష్టాలు పడాల్సివచ్చేదని తెలిపారు. బిడ్డల చదువే తామిచ్చే ఆస్తిగా భావిస్తున్నామని పేర్కొంటున్నారు.

పిల్లల చదువు అప్పుడు కష్టంగా ఉండేది



నేను మా ఇంటాయన కూలి పనులు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. మా బిడ్డల్ని బడికి పంపాలంటే యూనిఫాం, పుస్తకాలు, నోట్బులు కొనేందుకు ఏటా ఇబ్బంది పడేవాళ్లం. జగనన్న పాలనలో మా గ్రామంలోని బడి చక్కగా ఉంది. పిల్లలకు అన్ని సౌకర్యాలందుతున్నాయి. ముఖ్యంగా అమ్మ ఒడి డబ్బుతో ఇబ్బందులు లేకుండా పిల్లలను చదివించుకుంటున్నాం.

– శారద, విద్యార్థిని తల్లి, రాయలపేట, పెద్దపంజాణి మండలం

అమ్మ ఒడి డబ్బు పిల్లల చదువుకే వెచ్చిస్తున్నా



సర్కారు బడుల్లో జగనన్న విద్యా కానుక కింద ఏడు రకాల విద్యా సామగ్రి ఇస్తున్నారు. పిల్లల చదువుకోసం ఏటా అమ్మ ఒడి అమలుచేస్తున్నారు. మధ్యాహ్న భోజనం చాలా బాగుంది. పొద్దున రాగిజావ ఇస్తున్నారు. ఇన్ని సౌకర్యాలున్న సర్కారు బడులను కాదని ప్రైవేటు బడులకు పిల్లలను ఎందుకు పంపుతాము. అమ్మ ఒడి కింద వచ్చే డబ్బును పిల్లల చదువుకోసమే వాడుతున్నాం.

– నగీనా, గంటావూరు, పలమనేరు మున్సిపాలిటీ

మా ఇద్దరు పిల్లలకు అమ్మ ఒడి వస్తోంది



మా ఇద్దరు పిల్లలకు అమ్మ ఒడి అందుతోంది. ఎలాగూ బడిలో పిల్లలకు అన్నీ ఉచితంగానే అందజేస్తున్నారు. మంచి భోజనం పెడుతున్నారు. అనేక సౌకర్యాలు ఉన్నాయి. మాపై భారం పడకూడదని ప్రభుత్వం అమ్మ ఒడి కింద డబ్బు వేస్తోంది. ఆ డబ్బును దాచుకుని అవసరమైనప్పుడు పిల్లల చదువు కోసమే వాడుకుంటున్నాం. మాకు అమ్మవడి పథకం బాగా మేలు చేస్తోంది.

– అముద, గంటావూరు, పలమనేరు

అమ్మ ఒడి మాకు ఎంతో మేలు చేసింది



నా కుమార్తె భువనేశ్వరి గ్రామంలోని బడిలో మూడో తరగతి చదువుతోంది. ప్రైవేటు బడిలో చేర్దామని పోతే ఫీజు ఎక్కువగా చెప్పారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాం. అన్ని సౌకర్యాలు కల్పించినా తల్లిగా నాకు అమ్మ ఒడి ద్వారా ఏటా రూ.15 వేలు ఇస్తున్నారు. నా బిడ్డ చదువుకు చీకు చింతా లేకుండా పోయింది. నిజంగా మాలాంటి పేదోళ్లకు ఇది చాలా మంచి పథకం.

– సునీత, విద్యార్థిని తల్లి, వెంగంవారిపల్లి, బైరెడ్డిపల్లి మండలం

మీ ఇంటి బిడ్డను.. ఆశీర్వదించండి



మంత్రి రోజాకు గజమాలతో స్వాగతం పలుకుతున్న జీరకుప్పం గ్రామస్తులు

- ప్రజల మేలుకోరే పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్
- సూపర్ సిక్స్ అంటూ టీడీపీ జిమ్మిక్ చేస్తోంది
- మంత్రి ఆర్కేరోజా

నగరి: ''నేను మీలో ఒక వ్యక్తిని.. మీ ఇంటి బిడ్డను.. ఎన్నికల్లో నన్ను ఆశీర్వదించండి'' అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా కోరారు. ఆమె బుధవారం బీరకుప్పం పంచాయతీలో ప్రచారం చేశారు. ఆమెకు స్థానికులు అపూర్వ స్వాగతం పలికారు. ఆమె ప్రతి ఇంటికీ వెళ్లి అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ప్రభుత్వం ద్వారా అందించిన సంక్షేమాన్ని కళ్లకు కట్టినట్లు వివరించారు. ఆమె మాట్లాడుతూ నిజమైన ప్రజాసేవ వైఎస్సార్ సీపీకే సాధ్యమన్నారు. మన రాష్ట్రాన్ని, మన నియోజకవర్గాన్ని మన ప్రాంతాన్ని, మన గ్రామాన్ని ఏ ప్రభుత్వమైతే అభివృద్ధి చేసిందో ఆ ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుందని నిరూపించాలన్నారు. పంచాయతీలోని కావేటిపురం దళితవాడకు మూడుతరాలుగా రోడ్డు లేదని, తాము వేసినట్టు వివరించారు. వరద సమయంలో రోడ్డు కొట్టుకుపోతే యుద్ధ ప్రాతిపదికన సరిచేశామని, శ్మశానాలకు దారి వసతి కల్పించామన్నారు. 2019 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి అమలుచేశారని వెల్లడించారు.

చంద్రబాబు ఒక్క హామీనీ నెరవేర్చలేదు

చంద్రబాబు 2014లో 600లకు పైగా హామీలను ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చాక ఒక్క హామీని కూడా అమలుచేయలేదని గుర్తుచేశారు. ప్రస్తుతం సూపర్ సిక్స్ అంటూ కొత్తగా మోసం చేయడానికి వస్తున్నాడని వివరించారు. నమ్మి వెళ్లారంటే బంగారు కడియం కోసం వెళ్లి పులికి ఆహారమైన కథ లెక్కేనన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, ఢిల్లీ, ఎంపీటీసీ తులసీచంద్రారెడ్డి, సర్పంచ్ మునస్వామి, మాజీ సర్పంచ్ ఏలుమలై రెడ్డి, వైస్ సర్పంచ్ దేవరాజులు, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, నాయకులు జగన్మోహన్ రెడ్డి, శశికుమార్, విజయ్, చంద్రారెడ్డి, రామచంద్ర, నాగభూషణం, హెన్రీ, పళని, సుమన్, వెంకటేశ్, గోవర్ధన్ పాల్గొన్నారు.

మే 3 నుంచి పోస్టల్ బ్యాలెట్ల పంపిణీ

- 12 వేల మంది ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం
- ఈనెల 21 నుంచి ఇంటి వద్దే ఓటు ప్రక్రియకు బీఎల్‌ఓల సర్వే
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ మణికంఠ



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులకు మే 3వ తేదీ నుంచి పోస్టల్ బ్యాలెట్లను పంపిణీ చేయనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఆయన బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల విధులకు హాజరవుతున్న 12 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులకు మే 3వ తేదీ నుంచి పోస్టల్ బ్యాలెట్ అందజేస్తామన్నారు. ర్యాండమైజేషన్ తర్వాత పీఓ, ఏపీఓ, ఓపీఓలకు నియోజకవర్గాలు కేటాయిస్తామన్నారు. విధులు కేటాయించిన వారు తప్పనిసరిగా సంబంధిత ఆర్‌ఓలు నిర్వహించే శిక్షణా కార్యక్రమాలకు హాజరవ్వాలన్నారు. ఆయా రాజకీయ పార్టీల ప్రచారానికి సంబంధించిన వివరాలను సంబంధిత పోలీస్ స్టేషన్లలో ఇచ్చి అనుమతి పొందాలన్నారు. ఈ నెల 21 నుంచి విభిన్న ప్రతిభావంతులు, 85 ఏళ్లు నిండిన వారు ఇంటి వద్దే ఓటు వేసే ప్రక్రియకు బీఎల్‌ఓలు సర్వే చేస్తారని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలుంటే రాజకీయపార్టీల ప్రతినిధులు తమకు లేదా ఆయా నియోజకవర్గాల ఆర్‌ఓల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఎస్పీ మణికంఠ మాట్లాడుతూ వివిధ రాజకీయ పార్టీలు ప్రచారం చేసే ముందు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. తద్వారా వివిధ పార్టీలు ఒకే ప్రాంతంలో ఒకే సమయంలో ప్రచారం నిర్వహించకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు 7 కంపెనీల ప్రత్యేక దళాలను రప్పించినట్టు పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ పుల్లయ్య, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉదయ్, అట్లూరి శ్రీనివాసులు, సురేంద్ర, పరదేశి, గోవిందం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారాయణ స్వామి

అవినీతి చక్రవర్తి చంద్రబాబు

గంగాధరనెల్లూరు : దేశంలోని అతిపెద్ద అవినీతి చక్రవర్తి చంద్రబాబు అని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఆరోపించారు. ఆయన బుధవారం గంగాధర నెల్లూరు మండలంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలను ఇబ్బంది పెట్టడానికి కూటమి పేరుతో పచ్చ పత్రికలు, దుష్ట చతుష్టయాలు ఒకటయ్యాయని పేర్కొన్నారు. పేద ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్న ఏకైక వ్యక్తి సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి అని, అర్హతే ప్రామాణికంగా పథకాలు అందజేసిన ఏకైక నాయకుడన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, సార్వత్రిక ఎన్నికల్లో ఓటుతో జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటారని స్పష్టం చేశారు. మేనిఫెస్టోలో ఇచ్చిన 99 శాతం అమలుపరిచిన ఏకైక సీఎం జగన్ అని, మేనిఫెస్టోని వెబ్‌సైట్ నుంచి తొలగించిన వ్యక్తి చంద్రబాబు అని వివరించారు. పేదలకు మంచి జరిగితే ఓర్వలేని బుద్ధి చంద్రబాబుదని అన్నారు.

క్లుప్తంగా

బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్టు


నిందితుడు గణేష్

పుంగనూరు: బాలికపై లైంగిక దాడి చేసి ఆమె ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన నిందితుడు గణేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ రాఘవరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కమతంపల్లెకు చెందిన గణేష్ ఈ నెల 7వ తేదీ మధ్యాహ్నం ఇటుకల బట్టీ వద్ద బాలికపై లైంగిక దాడి చేశాడన్నారు. బాలిక కేకలు వేయడంతో తల్లి, గ్రామస్తులు అక్కడికి చేరుకుని ఆమెను కాపాడారని పేర్కొన్నారు. బాలిక మనస్తాపం చెంది ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందన్నారు. పరారీలో ఉన్న గణేష్‌ను మంగళవారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. శ్రీవారికి హుండీ ద్వారా రూ.2.71 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

టెర్రరిస్టులతో పోల్చడం తగదు

కరోనా విపత్తులో కుటుంబ సభ్యులు, బంధువులు కూడా పట్టించుకోకపోయినా ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలు చేశామని, ప్రజలకు ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలను నిస్వార్థంగా అందిస్తున్నట్టు వలంటీర్లు తెలిపారు. తమ సేవలను గుర్తించకపోయినా పర్వాలేదని, టెర్రరిస్టులుగా, సంఘ విద్రోహక శక్తులుగా టీడీపీ, జనసేన నేతలు పేర్కొనడం ఏమీ బాగోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారి వ్యాఖ్యలకు మనస్తాపం చెంది రాజీనామా చేస్తున్నట్టు వివరించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డికి అండగా ఉండి ఎన్నికల్లో ప్రచారం చేస్తామని వెల్లడించారు.

- వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు
- టీడీపీ, జనసేన నాయకుల వ్యాఖ్యలకు మనస్తాపం
- ఎన్నికల్లో సత్తా చూపుతామని స్పష్టం


గుడిపాల: వసంతాపురం సచివాలయానికి చెందిన వలంటీర్లు


గుడిపాల సచివాలయం పరిధిలోని వలంటీర్లు


కల్లూరు పంచాయతీ కార్యదర్శి యుగంధర్‌కు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

గుడిపాలలో 15 మంది..

గుడిపాల: టీడీపీ, జనసేన నాయకులు చేస్తున్న ఆరోపణలు, వేధింపులకు మనస్తాపం చెంది మండలంలోని 15 మంది వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ రాజశేఖర్‌రెడ్డి అందజేశారు. వారు మాట్లాడుతూ గౌరవ వేతనం తీసుకుని ప్రజలకు సేవ చేస్తున్న తమపై తెలుగుదేశం, జనసేన నాయకులు అనేక ఆరోపణలు చేయడంతోపాటు సంఘ విద్రోహక శక్తులని పేర్కొంటూ వేధిస్తున్నారని వాపోయారు. దీంతో తాము రాజీనామా చేసినట్టు తెలిపారు. ఇకపై ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తామన్నారు. రాజీనామా చేసిన వారిలో వసంతాపురం, గుడిపాల, పేయనపల్లె సచివాలయాల్లో ఐదుగురు చొప్పున ఉన్నారు.

పులిచెర్ల మండలంలో 57 మంది..

పులిచెర్ల(కల్లూరు): మండలానికి చెందిన 57 మంది వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. కల్లూరు పంచాయతీలో 32 మంది, మతుకువారిపల్లె పంచాయతీలో 12 మంది, ఎల్లంకివారిపల్లె, పోశంవారిపల్లి పంచాయతీల్లో 13 మంది రాజీనామా చేసి పత్రాలను కార్యదర్శులకు అందజేశారు. పేదలకు నిస్వార్థంగా సేవలు అందించినా టీడీపీ, జనసేన నేతలు తమపై ఇష్టారీతిన వ్యాఖ్యలు చేస్తున్నారని, వారి మాటలకు మనస్తాపం చెంది రాజీనామా చేసినట్టు తెలిపారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు కోసం ప్రచారం చేస్తామన్నారు. పుంగనూరు ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీగా మిథున్ రెడ్డిని గెలిపించుకుని జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకుంటామని పేర్కొన్నారు.

రొంపిచెర్లలో తొమ్మిది మంది..


రొంపిచెర్ల: చెంచెంరెడ్డిగారిపల్లెలో రాజీనామా చేస్తున్న వలంటీర్లు


బైరెడ్డిపల్లె: రాజీనామా పత్రాలను చూపుతున్న దేవదొడ్డి వలంటీర్లు

రొంపిచెర్ల: మండలంలోని చెంచెంరెడ్డిగారిపల్లె పంచాయతీకి చెందిన 9 మంది వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. వారు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో రెడ్డెప్ప ఆచారికి అందజేశారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తమపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా రాజీనామా చేసినట్టు పేర్కొన్నారు. ఐదు సంవత్సరాలుగా ప్రజలకు సేవ చేసుకునే అవకాశం కల్పించిన మంత్రి పెద్దిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యదర్శి శశికుమార్ పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో 31 మంది..

బైరెడ్డిపల్లె : మండలంలోని తీర్థం, దేవదొడ్డి సచివాలయాలకు చెందిన 31 మంది వలంటీర్లు బుధవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీఓ రాజేష్‌కు అందజేశారు. వారు మాట్లాడుతూ ఎక్కడా అవినీతికి తావులేకుండా పేదలకు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు అందేలా చూశామన్నారు. తమను కించపరుస్తూ మాట్లాడిన టీడీపీ, జనసేన నాయకులకు ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి భారీ చేరికలు

కరోనా కష్టకాలంలోనూ పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగనన్న పనిచేశారని పలువురు టీడీపీ నేతలు తెలిపారు. కులాలు, మతాలు, పార్టీలతో పనిలేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందించారని పేర్కొన్నారు. అలాంటి నాయకుడికి అండగా ఉండాలని తాము భావించినట్టు వెల్లడించారు. ఆయన వెంట నడవాలనే ఉద్దేశంతో వైఎస్సార్ సీపీలో చేరినట్టు వివరించారు. ఎన్నికల్లో ప్రజల్లోకి వెళ్లి మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు తమవంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.

- నిండ్రలో టీడీపీకి చెందిన 40 కుటుంబాలు
- పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి ఆర్‌కే రోజా
- పలమనేరులో పార్టీ కండువాలు కప్పిన ఎమ్మెల్యే వెంకటేగౌడ
- సీఎం జగనన్న పరిపాలనకు ఆకర్షితులై పార్టీలో చేరినట్టు వెల్లడి


మంత్రి రోజా సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు


వైఎస్సార్‌సీపీలో చేరిన వీకోట మండలానికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు

నిండ్ర: మండలంలోని పాత ఆరూరు గ్రామానికి చెందిన 40 కుటుంబాలకు చెందిన టీడీపీ నేతలు బుధవారం బి.కృష్ణమరాజు ఆధ్వర్యంలో మంత్రి, వైఎస్సార్ సీపీ నగరి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌కే రోజా సమక్షంలో పార్టీలో చేరారు. వారికి మంత్రి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఎం.నల్లమరాజు, వెంకట్‌రాజు, టి.సుబ్రమణ్యంరాజు, ఎల్.సుబ్రమణ్యం రాజు, జి.గంగరాజు, ఎస్.దేశింగ్ రాజు, కైలాసరాజు, టి.ధర్మరాజు, గోవర్దన్ రాజు, సుబ్రమణ్యరాజు, జి.సుబ్రమణ్యంరాజు, ఎఫ్.వెంకటరాజు, బి.లక్ష్మీపతిరాజు, ఎం.చరణ్, సంజీవి, కన్నయ్య, నరసింహులు, బాబు, దశరథ, మోహన్, వెంకటరత్నం, ధర్మయ్య, టి.సురేష్, కె.హనుమంతు, రాఘవయ్య, వెంకటేశులు, బలరాం, చంగల్రాయులు, కుప్పయ్య, టి.ఆదయ్య, రామ్మూర్తి, నాగరాజు, గంగాధరం, అన్నామలై, టి.సుబ్రమణ్యం, ఆర్ముగం, కుప్పయ్య, నల్లక్క, చెంచమ్మ, సంపూర్ణమ్మ, కన్నెమ్మ ఉన్నారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను చూసి వైఎస్సార్ సీపీలో చేరినట్టు తెలిపారు. తమ గ్రామంలో పాఠశాలను రూ.79 లక్షలతో కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేశారని తెలిపారు. మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఇంకా తమ గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారని వివరించారు. ఈ క్రమంలో మంత్రి రోజాకు అండగా ఉండాలనే ఉద్దేశంతో వైఎస్సార్ సీపీలో చేరామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వేణుగోపాల్ రాజు, సర్పంచ్ కేశవులు, ఆర్‌బీకే చైర్మన్ వీరయ్య, రామచంద్రారెడ్డి, రమేష్, వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.


టీడీపీ నుంచి ఓ రోజులోనే సొంత గూటికి చేరిన మహేష్

వైఎస్సార్‌సీపీలో చేరిన రవిరాజు

చౌడేపల్లె: ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధికి ఆకర్షితుడినై వైఎస్సార్ సీపీలో చేరినట్టు శెట్టిపేట పంచాయతీ మేకలచిన్నేపల్లెకు చెందిన టీడీపీ నేతలు రవిరాజు, రజని తెలిపారు. వారు బుధవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి పెద్దిరెడ్డి పార్టీ కండువాను వేసి ఆహ్వానించారు. సర్పంచ్ ఓబుల్‌రెడ్డి, పద్మావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వి.కోటలో..

వి.కోట/పలమనేరు: వి.కోట మండలం గోనుమాకులపల్లికి చెందిన పలువురు టీడీపీ, జనసేన పార్టీ నాయకులు బుధవారం ఎమ్మెల్యే వెంకటేగౌడ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గోవిందప్ప, మోహన్‌బాబు, విజయ్, తిప్పాచారి, నాగ, యోగేష్, సుబ్బు, అభిలాష్, అజయ్, మోహన్ తదితరులు ఉన్నారు. వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన, చేసిన అభివృద్ధిని చూసి పార్టీలో చేరినట్టు తెలిపారు. అదే విధంగా టీడీపీ నాయకుల ప్రలోభాలకు గురై ఆ పార్టీలో చేరిన వైఎస్సార్‌సీపీ విద్యార్థి సంఘం నేత మహేష్ తాను తప్పుచేశానని పేర్కొంటూ బుధవారం ఎమ్మెల్యే సమక్షంలో తిరిగి సొంతగూటికి చేరుకున్నారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నేతలు చెంగారెడ్డి, ప్రహ్లాద, హేమంత్, పార్థ తదితరులు పాల్గొన్నారు.


కళ్యాణ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పెద్దపంజాణిలో...

పెద్దపంజాణి: మండలంలోని నేలపల్లికి చెందిన టీడీపీ యువ నాయకుడు కళ్యాణ్ గురువారం ఎమ్మెల్యే వెంకటేగౌడ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాడు. ఎమ్మెల్యే ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తానని కళ్యాణ్ తెలిపారు.

డాక్టర్ థామస్‌పై చర్యలు తీసుకోవాలి

- మిట్టపల్లి సతీష్‌రెడ్డి డిమాండ్


థామస్‌కు 2019లో తమిళనాడు యూనివర్సిటీ ఇచ్చిన సర్టిఫికెట్


కర్ణాటక యూనివర్సిటీ వారు అందజేసిన సర్టిఫికెట్

కార్వేటినగరం: వైద్య విద్య చదవకుండా వైద్యునిగా చలామణి అవుతున్న జీడీనెల్లూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వీఎం థామస్‌పై మెడికల్ కౌన్సిల్ చర్యలు తీసుకోవాలని హిందూ ధర్మ పరిరక్షణ సమితి కన్వీనర్ మిట్టపల్లి సతీష్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన బుధవారం మాట్లాడుతూ థామస్ బయోటెక్నాలజీలో పీజీ, పశువుల ఐవీఎఫ్ శిక్షణ సర్టిఫికెట్ అడ్డు పెట్టుకుని సంతాన సాఫల్య వైద్యునిగా చెప్పుకుంటున్నాడని ఆరోపించారు. బయోటెక్నాలజీలో పీజీ చేసిన ఆయన 2011లో కర్ణాటక యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందాడని తెలిపారు. తమిళనాడు వెటర్నరీ అండ్ అనిమల్ సైన్స్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 2001 ఫిబ్రవరిలో ఎన్ విట్రో పర్టిలైజేషన్ ఆఫ్ ఫార్మ్ అనిమల్స్ అన్న అంశంపై 13 రోజులు శిక్షణ పొందాడని చెప్పారు. ఈ సర్టిఫికెట్లు ఉన్న థామస్ ఎందరికో పిల్లలు పుట్టించానని చెప్పుకోవడం ప్రజలను తప్పుదారి పట్టించడమేనన్నారు. కనీసం టెక్నీషియన్ అర్హత కూడా లేకుండా డాక్టర్‌గా చెప్పుకుని ప్రజలను మోసం చేస్తున్న థామస్‌పై తమిళనాడు, ఏపీ మెడికల్ కౌన్సిళ్లు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

భార్యపై అనుమానంతో కత్తితో దాడి

కుప్పం రూరల్: మండలంలోని సలార్లపల్లిలో మంగళవారం రాత్రి భార్యపై అనుమానంతో భర్త కత్తితో దాడి చేశాడు. పోలీసుల కథనం మేరకు.. వానగుట్టపల్లికి చెందిన అంబిక (36), సలార్లపల్లికి చెందిన మురళికి 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. మద్యానికి బానిసైన మురళి భార్యపై అనుమానంతో వేధించేవాడు. మంగళవారం రాత్రి అతిగా మద్యం సేవించి భార్యతో గొడవకు దిగాడు. కుమారులు ఇద్దరు ఇంటిపైకి వెళ్లిపోవడంతో మురళి కత్తి తీసుకుని భార్య మెడపై నరికాడు. ఆమె కేకలు వేయడంతో కుమారులు కిందికి వచ్చారు. అప్పటికే అంబిక రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతోంది. ఆమెను వెంటనే కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి బెంగళూరు తీసుకెళ్లారు. కుప్పం అర్బన్ సీఐ ఎస్వీ రమణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

– యువకుడి మృతి

పూతలపట్టు: మండలంలోని కిచ్చెనగారిపల్లి వద్ద జాతీయ రహదారిలో బుధవారం కారు డివైడర్‌ను ఢీకొంది. దీంతో యువకుడు మృతిచెందాడు. సీఐ సుదర్శన ప్రసాద్ కథనం మేరకు.. తిరుపతి లక్ష్మీపురం సర్కిల్‌కు చెందిన రాజేంద్రరెడ్డి కుమారులు వివేక్‌రెడ్డి, దీపక్‌రెడ్డి(16) బుధవారం తిరుపతి నుంచి బెంగళూరుకు కారులో బయలుదేరారు. మార్గమధ్యంలో పూతలపట్టు మండలం కిచ్చెనగారిపల్లి వద్ద జాతీయ రహదారిలో కారు డివైడర్‌ను ఢీకొంది. దీంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు అక్కడికి చేరుకుని వారిని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ దీపక్‌రెడ్డి మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.7.86 లక్షల నగదు స్వాధీనం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ఇద్దరి నుంచి రూ.7,86,500 నగదు స్వాధీనం చేసుకున్నట్టు టూటౌన్ సీఐ ఉలసయ్య తెలిపారు. తమ సిబ్బందితో కలిసి బుధవారం చిత్తూరులోని డీఐ రోడ్డు, గాంధీరోడ్డులో తనిఖీలు చేపట్టామన్నారు. ఈ క్రమంలో శరవణ అనే వ్యక్తి వద్ద రూ.7 లక్షలు, అఫ్రోజ్ అనే వ్యక్తి నుంచి రూ.86,500 ఉన్నట్టు గుర్తించామన్నారు. వాటికి ఆధారాలు చూపించకపోవడంతో ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది గోపితో కలిసి స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

నేను సైతం

– నగరిలో దివ్యాంగుడి ప్రచారం

నగరి : వైఎస్సార్‌సీపీ విజయం కోసం దివ్యాంగుడైన వృద్ధుడు నేను సైతం అంటూ ప్రచారంలో పాల్గొనడం పలువురిని ఆకట్టుకుంటోంది. మండలంలోని బీరకుప్పం పంచాయతీ నాగరాజకుప్పం గ్రామానికి చెందిన దివ్యాంగుడు ఏలుమలై రెడ్డి (73) బుధవారం మూడు చక్రాల సైకిల్‌కు వైఎస్సార్ సీపీ జెండా కట్టుకుని మంత్రి రోజా చేసిన అభివృద్ధి పనులు, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి అమలుచేసిన సంక్షేమ పథకాల ద్వారా నియోజకవర్గానికి చేకూరిన లబ్ధిని వివరించే కరపత్రాలను అందరికీ పంచిపెట్టారు. వికలాంగుడైన తనకు ముఖ్యమంత్రి నెలకు రూ.3 వేలు పింఛను ఇస్తున్నారని, రైతు భరోసా వస్తుందని, నా మనవళ్లకి అమ్మ ఒడి మంజూరవుతోందని పేర్కొన్నారు. ఇంతగా సాయపడే ప్రభుత్వంపై ఇలా విశ్వాసం చూపిస్తున్నట్టు తెలిపారు.

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య

పలమనేరు: పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన పలమనేరులో బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన గౌస్‌బాషా భార్య హసీనా(28) బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన చుట్టుపక్కల వారు ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆమె ఆత్మహత్యకు కుటుంబ కలహాలే కారణమని సమాచారం. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత దర్యాప్తు చేస్తామని, తర్వాత పూర్తి వివరాలు తేలుతాయని పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్‌లో మహిళలకు కరువైన ప్రాధాన్యత

- షర్మిల నేతృత్వంలో పాతాళంలోకి కాంగ్రెస్ పార్టీ
- వైఎస్సార్ సీపీలోనే మహిళలకు పెద్ద పీట
- జీడీనెల్లూరు కాంగ్రెస్ టికెట్ ఆశించిన అములు



నగరి: కాంగ్రెస్ పార్టీలో మహిళలకు ప్రాధాన్యత ఎక్కడ ఉంది అని ఆ పార్టీ గంగాధర నెల్లూరు అసెంబ్లీ సీటుకు దరఖాస్తు చేసుకున్న టి.అములు ప్రశ్నించారు. ఆమె బుధవారం నగరిలో విలేకరులతో మాట్లాడారు. గతంలో వైఎస్సార్ నేతృత్వంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇద్దరు మహిళలకు అసెంబ్లీ స్థానాలు కేటాయించేవారని పేర్కొన్నారు. ప్రస్తుతం మహిళా అధ్యక్షురాలి నేతృత్వంలోనే మహిళలకు ప్రాధాన్యత దక్కడం లేదన్నారు. చిత్తూరు జిల్లాలో వైఎస్సార్ సీపీ మాత్రమే ఇద్దరు మహిళలకు అవకాశం ఇచ్చిందన్నారు. ఆర్థికంగా బలంగా ఉన్న వారికి మాత్రమే టికెట్ ఇస్తున్నారని ఆరోపించారు. షర్మిల పీసీసీ పదవిని దక్కించుకోవడంతో పార్టీ బలపడుతుందనుకున్నామని, కానీ అది పాతాళం వైపు ప్రయాణిస్తోందన్నారు. నగరి, గంగాధర నెల్లూరు నియోజకవర్గాల్లోని అనుచరులతో చర్చించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తానన్నారు.

కారు ఢీకొని మహిళ మృతి

శాంతిపురం: కుప్పం– పలమనేరు జాతీయ రహదారిలోని గుండిశెట్టిపల్లి వద్ద బుధవారం కారు ఢీకొని మహిళ మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు.. కెనమాకులపల్లి పంచాయతీ గడ్డూరుకు చెందిన చంద్రారెడ్డి భార్య భారతి (50) బీజేపీ మండల మహిళా మోర్చా అధ్యక్షురాలిగా పనిచేస్తున్నారు. ఆమె బుధవారం తన మేనల్లుడు కరుణాకర్‌రెడ్డితో కలిసి బైకులో గుండిశెట్టిపల్లిలోని పుట్టింటికి బయలుదేరారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్‌పోస్టు వద్ద తమిళనాడు సూలగిరి నుంచి వస్తున్న కారు ఢీకొంది. గాయపడిన ఇద్దరిని కుటుంబ సభ్యులు కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే భారతి మృతి చెందినట్టు వైద్యులు ధృవీకరించారు. మృతదేహాన్ని కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. రాళ్లబూదుగూరు ఎస్ఐ సుమన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డివామి దగ్ధం

చౌడేపల్లె: గడ్డంవారిపల్లె పంచాయతీ చౌడగానిపల్లెకు చెందిన కె.రత్నం గడ్డివామి బుధవారం దగ్ధమైంది. బాధితుడు మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు కంచెకు నిప్పు పెట్టడంతో గడ్డివామికి మంటలు అంటుకున్నట్టు తెలిపాడు. పుంగనూరు అగ్నిమాపక అధికారి సుబ్బరాజుకు సమాచారం ఇచ్చినట్టు తెలిపాడు. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేశారని పేర్కొన్నాడు. రూ.50 వేల ఆస్తి నష్టం వాటిల్లినట్టు వాపోయాడు. ఘటనా స్థలాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించారు.